
చదువుకుందాం రండి..



వేసవి సెలవుల్లో ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుకుంటే విజ్ఞానం పెరుగుతుంది. సరదా, సాహిత్యం, విజ్ఞానం, మేధస్సును పెంచే బుక్స్ చదువుకోవడం మంచిది. 10లో▸



ఇళ్లలోనే ఆలయాలు! 11లో▸

సిర్పూర్ నియోజకవర్గంలోని ఈస్‌గాం, లక్ష్మీపూర్, రవీంద్రనగర్ గ్రామాల పరిధిలో బెంగాలీలు నివసిస్తున్నారు. వీరు ఇండ్లలోనే ఆలయాలు నిర్మించుకోవడం విశేషం..

గరిష్టం/కనిష్టం
44.0 /30.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఇన్నోవేషన్ అవార్డు అందుకున్న రంగయ్య సార్



అవార్డు అందుకుంటున్న రంగయ్య సార్

కెరమెరి(ఆసిఫాబాద్): ఇప్పటివరకు ఎన్నో అవార్డులు, ప్రశంసలు, ఎందరో ప్రముఖుల ద్వారా అభినందనలు అందుకున్న మండలంలోని సావర్‌ఖెడా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడేర్ల రంగయ్య శనివారం ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. ముంబైలోని రాడిసన్ బ్ల్యూస్టార్ హోటల్‌లో 'ఏషియన్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్' అనే స్వచ్ఛంద సంస్థ అంతర్జాతీయ స్థాయిలో విద్యాబోధన చేసిన ఉత్తములకు అవార్డులు ప్రదానం చేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు గౌరవ్ గౌతమ్ చేతుల మీదుగా కడేర్ల రంగయ్య అవార్డుతో పాటు సత్కారాన్ని అందుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులతో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు చెందిన 10మంది కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యాసదస్సులో నూతన విద్యారంగం, విలువలతో కూడిన అంశాలు, విద్యార్థుల్లో ఉన్న ఒత్తిడిని తగ్గించడం ఎలా? మోరల్ ఎడ్యుకేషన్, వినూత్న విధానం తదితర అంశాల గురించి చర్చించినట్లు రంగయ్య 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో ముంబై ఎంపీ అరవింద్ సావంత్, ముంబై మెంబర్ ఆఫ్ జస్టిస్ బోర్డు ఊర్మిళా జాదవ్, సోనీ ఇంటర్నేషనల్ సీసీవో హరీశ్ పాల్గొని తన కృషిని కొనియాడారని పేర్కొన్నారు. తాను అందుకున్న ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థులు విద్యాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి మరింత సేవ చేస్తానని, అందరి సహకారంతోనే అవార్డు వచ్చిందని తెలిపారు.

సీఎం కప్ పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా స్థాయిలో ఈ నెల 22నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే సీఎం కప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా క్రీడా యువజనశాఖ కార్యాలయంలో గాని లేదా 8008090626 నంబర్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

15 నుంచి ఇంటర్ అడ్మిషన్లు స్వీకరించాలి



జూమ్ మీటింగ్‌లో డీఐఈవో శ్రీధర్ సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 15నుంచి ప్రారంభించాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ సూచించారు. శనివారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో జూమ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను నిర్ణీత పరిమితి మేరకు అడ్మిషన్లు స్వీకరించాలని సూచించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఇంటర్‌నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న మెమోల ఆధారంగా ప్రిన్సిపాల్‌లు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని, అధ్యాపకులు అన్ని గ్రూపులకు సరిపడా సంఖ్యలో అడ్మిషన్ల కోసం కృషి చేయాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్ నగర్ విలేజ్ నంబర్– 12 గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సౌలభ్యం కోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, వైస్ ఎంపీపీ స్వదేశ్‌శర్మ, ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ, ఎంపీటీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసేదెప్పుడో?



ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు (ఫైల్)

- 2014లో కేబినెట్ ఆమోదం
- ఉత్తర్వుల విడుదలలో జాప్యం
- సెకండ్ ఏఎన్‌ఎంల నిరీక్షణ
- జిల్లాలో విధుల్లో 150 మంది
- ఉద్యమానికి సిద్ధమవుతున్న వైనం

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు రెగ్యులరైజేషన్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో వీరు పాల్గొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వీరి సేవలు ఎంతో కీలకం. అంగన్‌వాడీలు, గురుకుల పాఠశాలల్లో గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుంటారు. రెండో ఏఎన్‌ఎంలుగా 15 సంవత్సరాలకు పైబడి విధులు నిర్వహిస్తుండగా వీరికి వేతనంగా రూ.21వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. రెండో ఏఎన్‌ఎంలు జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వహిస్తుంటారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా కుటుంబ పోషణ భారమైందని వారు వాపోతున్నారు.

2014లో కేబినెట్ ఆమోదం

రెండో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వీరిని రెగ్యులర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2014లోనే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం జీవో నంబర్ 22 ప్రకారం రోస్టర్ పద్ధతి ద్వారా రెగ్యులర్ చేయాల్సి ఉంది. రెగ్యులర్ విషయంలో ఏఎన్‌ఎంలు గతంలో 46 రోజులు సమ్మె చేయగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విరమింపజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది రెండో ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు.

డిమాండ్లివే..

- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించి, ఎన్‌హెచ్‌ఎం, ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి.
- 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం (బేసిక్) రూ.31,040తో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇతర అలవెన్సులు ఇవ్వాలి.
- పెండింగ్ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలి.
- వ్యాక్సిన్ అలవెన్స్ (రూ.500), యూనిఫాం అలవెన్స్ (రూ.2,500) చెల్లించాలి.
- 35రోజుల క్యాజువల్ లీవ్‌లతో పాటు 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలి.
- సబ్‌సెంటర్ అద్దె (రూ.1,500), స్టేషనరీ, జిరాక్స్ ఖర్చులు ఇప్పించాలి.
- వైద్యారోగ్యశాఖకు బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించి, పీహెచ్‌సీలు ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. నైట్ డ్యూటీలు, ఓపీ డ్యూటీలను రద్దు చేయాలి.

కోర్టుతీర్పు అమలు చేయాలి

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనాన్ని చెల్లించాలి. హెచ్‌ఎన్‌ఎం, ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మా ఇబ్బందులు గమనించి త్వరగా సమస్య పరిష్కరించాలి. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి.

– నామెవార్ సంతోషి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రెగ్యులర్ చేసేదాకా ఉద్యమిస్తాం

రాష్ట్ర ప్రభుత్వం 2014లో కేబినెట్‌లో నిర్ణయించినట్లు రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ రాత్రింబవళ్లు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. వారిని నిర్లక్ష్యం చేయడం సరికాదు. ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి సమస్య వివరించి పరిష్కారానికి కృషి చేయాలి.

– లోకేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

'అమ్మ'వారి సేవలో..



విత్తన పూజలు నిర్వహిస్తున్న కటోదాలు



జంగుబాయిని దర్శించుకుంటున్న భక్తులు

- జంగుబాయి సన్నిధిలో విత్తనపూజలు
- వివిధ జిల్లాల నుంచి భక్తుల రాక
- ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు
- మొక్కులు చెల్లించుకుంటున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): లక్షలాది మంది ఆదివాసీలు ఆరాధించి పూజించే జంగుబాయి సన్నిధిలో నిర్వహిస్తున్న 'విత్తన పూజ' ఉత్సవాలు 23రోజులుగా కొనసాగుతున్నాయి. అయినా భక్తుల రద్దీ తగ్గడం లేదు. మొదటిసారి ఏప్రిల్, మే నెలల్లో.. రెండోసారి డిసెంబర్, జనవరిలో ఉత్సవాలు కొనసాగుతాయి. తెలంగాణ–మహారాష్ట్ర వివాదాస్పద సరిహద్దు ప్రాంతమైన మండలంలోని ముకదంగూడ గ్రామపంచాయతీకి చెందిన మహరాజ్‌గూడ గ్రామ అడవుల్లో కొలువైన జంగుబాయి దేవతను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. వందల ఏళ్ల క్రితం అమ్మవారు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ఇక్కడ బస చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. శనివారం ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, జివితి, గడ్‌చందూర్, కొర్పణ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అధిక దిగుబడి రావాలని అమ్మవారిని కోరుకుంటున్నారు. సాగు భూముల్లో ఏయే రకాల విత్తనాలు వేస్తున్నారో.. వాటిన్నిటిని దేవతకు చూపిస్తే పంట దిగుబడి బాగా వస్తుందని వారి నమ్మకం. వివిధ రాష్ట్రాల్లోని జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వందలాది కుటుంబాల వారు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అంతా చెప్పులు లేకుండా కాలిబాట, ఎడ్లబండ్ల ద్వారా వందలాది కిలో మీటర్లు రవాణా సాగిస్తున్నారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పుజారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్షేత్రంలో బస చేసిన పోచమ్మతల్లికి కూడా మొక్కులు చెల్లించుకుంటున్నారు.



భేటింగ్ అవుతున్న మహిళలు

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అర్థమెటిక్ రీజనింగ్ శిక్షణ టాస్క్ కేంద్రంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వారం పాటు జరిగే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 79938 59595 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పోలీస్‌స్టేషన్ల తనిఖీ



పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ

దహెగాం: గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సురేశ్ కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఉన్న పోలీస్ ఆఫీసర్ స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి తరచూ గ్రామాలను సందర్శించాలని, ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. సరిహద్దుల్లో అనుమానితుల కదలికలపై దృష్టి సారించాలని, మావోయిస్టులకు సహకరించి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రజలను కోరారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

చింతలమానెపల్లి: గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి గ్రామ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి సిబ్బంది విధుల గురించి ఎస్సై విజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, పరిస్థితుల మీద దృష్టి పెట్టాలన్నారు. సంఘ విద్రోహ కార్యక్రమాలు, మావోయిస్టులకు సహకరించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ అక్కడి మౌలిక వసతులు, అవసరాలు, సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. డయల్ 100, ప్రజాఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై విజయ్‌కుమార్ ఉన్నారు.

రెగ్యులరైజ్ చేసేదాకా సమ్మె



రహదారిపై నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

ఆసిఫాబాద్‌రూరల్: తమను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు జీవో వచ్చేదాకా సమ్మె కొనసాగుతుందని జేపీఎస్‌లు స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణవంశీ మాట్లాడారు. గత 16 రోజులుగా తాము సమ్మె చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం, ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. స్వయంగా సీఎం కేసీఆర్ రెండేళ్ల తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ జీవో వచ్చేదాకా గ్రామపంచాయతీలకు పోయేది లేదని తేల్చి చెప్పారు. వెంటనే రెగ్యులర్ చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే మనస్తాపంతో మృతి చెందిన సోనీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు గణేశ్, రమేశ్, మహేశ్, రాజు, సాయి తదితరులున్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే..

- వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు
- ఫైరింజన్ చేరుకోవడంలో ఆలస్యం
- ప్రమాదాల్లో ఆస్తులు బుగ్గిపాలు



కౌటాల మండలం ముత్తంపేట్‌లో అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న ఇళ్లు (ఫైల్)

కౌటాల: వేసవి కావడంతో జిల్లాలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినపుడు కాగజ్‌నగర్ నుంచి ఫైరింజన్ వచ్చేలోపు ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. సిర్పూర్(టీ) నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట, బెజ్జూర్ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కాగజ్‌నగర్‌లోని ఫైరింజన్ సకాలంలో చేరుకోక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు



కౌటాలలో అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న షాప్ (ఫైల్)

కౌటాల మండల కేంద్రంలోని లేడీస్ ఎంపోరియం ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తినష్టం జరిగింది. అలాగే కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు బెండరే నాందేవ్, బెండరే వాగుకు చెందిన రెండు ఇళ్లు ఈ నెల 6వ తేదీన అర్ధరాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.13లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంట్లోని ధాన్యం, నగదు, విలువైన వస్తువులు కాలిపోవడంతో బాధిత కుటుంబం రోడ్డున పడింది. అగ్ని మాపక వాహనం ఆలస్యంగా చేరుకోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఫైరింజన్ అందుబాటులో ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు, గ్రామస్తులు వాపోయారు. ఇలాంటి అగ్ని ప్రమాదాలు ఏటా ఎన్నో జరుగుతున్నాయి. దీంతో సామాన్య ప్రజల నగదు, ఆస్తి, విలువైన సామగ్రితో పాటు చాలా నష్టపోతున్నారు.

దూరంగా కేంద్రం

కాగజ్‌నగర్ పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి బెజ్జూరు, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట, దహెగాం మండలాలకు ఫైరింజన్ చేరుకోవాలంటే దాదాపు 40 నుంచి 70కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో కాగజ్‌నగర్ నుంచి ప్రమాదస్థలానికి చేరుకోవడానికి దాదాపు 2నుంచి 3గంటల సమయం పడుతోంది. దీంతో మండలాల్లో వివిధ గ్రామాల్లో ప్రమాదవశాత్తు ఇళ్లు, వరి కుప్పలు, గడ్డివాములు, పశువుల కొట్టాలు, వాహనాలు అగ్ని ప్రమాదానికి గురైతే ఫైరింజన్ వచ్చేలోపే కాలిబూడిదవుతున్నాయని ఆయా మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తంజేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు

అగ్ని మాపక కేంద్రం ఆయా మండలాలకు సమీపంలో లేకపోవడంతో ఎంతో నష్టం జరుగుతోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు వాపోతున్నారు. కొన్నేళ్లుగా ఆయా మండలాల ప్రజలు సమస్య పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సిర్పూర్, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు మధ్యలో ఉన్న కౌటాల మండల కేంద్రంలో అగ్ని మాపకకేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆర్థికంగా నష్టపోతున్నాం

ఈ నెల 6వ తేదీన ప్రమాదవశాత్తు నా ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. మంటలు ఆర్పివేయడానికి ఫైరింజన్ వచ్చేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆయా మండలాల సమీపంలో అగ్ని మాపకకేంద్రం అందుబాటులో లేక అగ్ని ప్రమాదాలు జరిగినపుడు బాధితులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. మండలంలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా కాగజ్‌నగర్ నుంచి అగ్ని మాపక వాహనం రావడానికి గంటల సమయం పడుతోంది. దీంతో జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవాలి.

– బీ నాందేవ్, బాధితుడు, ముత్తంపేట

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

అగ్ని ప్రమాదం జరిగినపుడు కాగజ్‌నగర్ పట్టణంలో ఫైరింజన్ ఉన్నప్పటికీ సమయానికి రాక స్థానికులు నీళ్లు చల్లి మంటలు అదుపులోకి తెస్తున్నారు. కానీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరుగుతోంది. చింతలమానెపల్లి మండల కేంద్రానికి 60కిలో మీటర్ల దూరంలోని కాగజ్‌నగర్ పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఉంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఘటనా స్థలానికి ఫైరింజన్ చేరుకోవడానికి రెండు గంటల సమయం పడుతోంది. దీంతో ప్రజలు చాలా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కౌటాల మండల కేంద్రంలో అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

– మల్లేశ్, గంగాపూర్, చింతలమానెపల్లి మండలం

క్లుప్తంగా

శాంతిఖని గనిలో కార్మికుడికి గాయాలు

తాండూర్: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జరిగిన ప్రమాదంలో కార్మికుడికి గాయాలయ్యాయి. శనివారం 10 గంటల షిఫ్టులో గని ఉపరితలంలో కన్వేయర్ బెల్ట్‌ను అండర్ గ్రౌండ్‌లోకి పంపించేందుకు ఎస్కార్ట్‌తో టబ్బులో లోడ్ చేస్తుండగా బెల్ట్ తెగిపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు సాంశెట్టి వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. ఇందుకు కారణమైన ఇద్దరిపై గని అధికారులు చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

బజ్జీలు తిని పలువురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

తిర్యాణి(ఆసిఫాబాద్): వారసంతలో ఏర్పాటు చేసిన మిర్చిబండి వద్ద బజ్జీలు తిన్న పలువురు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని వారసంతలో మంచిర్యాల జిల్లా తాండూర్ మండలానికి చెందిన వ్యక్తి మిర్చి బండి నడుపుతున్నాడు. శుక్రవారం ఈ బండి వద్ద మిర్చీబజ్జీలు, బోండాలు తిన్నా 50 మందికి వాంతులు, విరోచనాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కలుషితమైన ఆహారం తిన్నందువల్లే అస్వస్థతకు గురయ్యారని, పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యుడు హర్షవర్ధన్ తెలిపారు. మిర్చిబండి నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో, బైక్ ఢీ..

బెజ్జూర్(సిర్పూర్): ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన ఆత్రం భుజంగరావ్, పార్వెటి మహేశ్, సాయిలు శనివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సోమిని గ్రామానికి వెళ్లారు. సాయంత్రం ముంజంపల్లికి తిరిగి వస్తుండగా కుకుడా–పోతేపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన ఆటో అదుపు తప్పి బైక్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు బైక్‌పై వస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

సీఎంకు పోస్టుకార్డులు పంపిన వీవోఏలు

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం వీవోఏలు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. క్రమబద్ధీకరణ చేసి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

వెహి'కిల్' డ్రైవింగ్!

- ప్రమాదమని తెలిసినా యువతలో తగ్గని వేగం
- రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్ అధికం
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- వేసవి సెలవుల్లో జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానా
2022	36	రూ.18 వేలు
2023 (మే 13 వరకు)	13	రూ.5వేలు



వాహనంపై దూసుకెళ్తున్న మైనర్లు

మంచిర్యాలక్రైం: అతివేగం ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం లైసెన్స్ లేనివారు, మైనర్లు ఉండడం కలవర పెడుతోంది. యువత బైక్ రేసింగ్‌లు, సినిమాల్లో హీరోలను చూసి వారిలాగే తామూ వాహనం నడపాలనే ఆలోచనతో వేగంగా దూసుకెళ్తున్నారు. విద్యాసంస్థలు, అమ్మాయిలు ఉన్నచోట గొప్పల కోసం విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. గతేడాది కరీంనగర్‌లో 16 ఏళ్ల బాలుడు నిర్లక్ష్యంగా కారునడిపి నలుగురి ప్రాణాలు బలిగొన్నాడు. ఈ ప్రమాద ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే...

కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం తీసుకువచ్చిన మోటార్ వాహనాల చట్టానికి స్వల్ప మార్పులు చేసి 2019 సెప్టెంబర్ 1 నుంచి అమలు చేయాలని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంతో ఆమోదం లభించింది. ఈ చట్టం ద్వారా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు సైతం సెక్షన్ –199 ప్రకారం రూ.25వేలు జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష, వాహన రిజిస్ట్రేషన్ రద్దు, ఉద్యోగులైతే ఉద్యోగం సైతం ఊడిపోతోంది. దీనిపై రాష్ట్రంలో కొంత నిరసనలు వ్యక్తమయ్యాయి.

చట్టం ఏం చెబుతోంది?

- ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనలను ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. అవి వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పు కలిగించేవి, మైనర్ డ్రైవింగ్.
- ఇండియన్ మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం 16 ఏళ్ల లోపు వయస్సు వారు ఎలాంటి వాహనాలు నడపకూడదు. 16 ఏళ్లు నిండిన వారు కేవలం గేర్లు లేని సాధారణ వాహనాలను మాత్రమే నడిపేందుకు అవకాశం ఉంది.
- 18 ఏళ్లు నిండిన తర్వాతనే గేర్లతో కూడిన వాహనాలు నడపడానికి అర్హులు. చట్ట ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇచ్చిన యజమాని సైతం శిక్షార్హుడేనని చట్టంలోని 180 సెక్షన్ చెబుతోంది.
- చట్టంలోని 2019 సవరణ ప్రకారం మైనర్ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే రూ.25 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. వాహనం ఇచ్చిన వారిని సైతం బాధ్యులను చేస్తారు.
- దేశ వ్యాప్తంగా ఏటా 11 శాతం రోడ్డు ప్రమాదాలు మైనర్లు వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.
- మైనర్లు వాహనాలు నడిపే సమయంలో అనుకోకుండా రోడ్డు ప్రమాదం జరిగి కేసు నమోదు చేస్తే చట్టపరంగా బాధితులకు రావాల్సిన ఎలాంటి బెనిఫిట్స్ వర్తించవు. వాహనానికి బీమా ఉన్నప్పటికీ దానిని క్లెయిమ్ చేయలేని పరిస్థితి.
- వాహనాలు నడిపే పిల్లలపై కోర్టుల్లో నేరాభియోగపత్రం దాఖలు చేస్తారు. దీంతో కనీసం రెండు నుంచి ఏడు రోజుల వరకు పరిశీలన గృహానికి (జువైనల్ హోం) తరలిస్తారు. వారికి వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపైనా కేసు నమోదు చేస్తారు.

జిల్లాలో జరిగిన సంఘటనలు కొన్ని..

- గతేడాది ఏప్రిల్ 26న మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్ సమీపంలో రహదారిపై ఓ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుకుంటూ రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు బాలు మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బాలునిపై కేసు నమోదైంది.
- గతేడాది జూన్ 17న హైటెక్ సిటీ వెనుకభాగంలో ఇద్దరు మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో గౌతమినగర్‌కు చెందిన ప్రణీత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. కాగా ఈ ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.
- గత నెల 30న హాజీపూర్ మండలం గుడిపేట వద్ద జాతీయ రహదారిపై 14 ఏళ్ల బాలుడు శ్రీహరి, 20 ఏళ్ల యువకుడు శ్రీధర్ కేటీఎం బైక్‌పై అతివేగంగా వెళ్తూ నిలిపి ఉన్న లారీని ఢీకొట్టారు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

తల్లిదండ్రులూ.. ఇవి గుర్తించండి

- సహజంగా 13 నుంచి 18 ఏళ్లలోపు బాలురకు వాహనాలు నడపాలన్న ఉత్సాహం ఎక్కువగానే ఉంటుంది. వెంటనే నేర్చుకోవాలని, వేగంగా, అందరికంటే డిఫరెంట్‌గా బైక్ నడపాలని ఉత్సాహపడుతారు. ఇదే రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. పలు సంఘటనల దృష్ట్యా మైనర్ డ్రైవింగ్‌ను తీవ్ర ఉల్లంఘనగా భావిస్తున్న ఉన్నత న్యాయస్థానాలు తల్లిదండ్రులకు సైతం శిక్షలు అమలు చేస్తున్నాయి.
- వాహనాలపై ఉన్న మోజుతో స్నేహితుల వద్ద గొప్పలు చెప్పుకునేందుకు ఇంట్లో తల్లిదండ్రులు ఏపనిచెప్పినా బైక్ ఇస్తేనే వెళ్తానని పిల్లలు మొండికేస్తుంటారు. తమ అవసరాల కోసం కన్నవాళ్లు కాదనలేక వాహనాలు ఇస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మైనర్లు రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్నారు. ఇలా వాహనాలు నడుపుతూ ఏదైనా ప్రమాదానికి గురైతే హత్య కేసు నమోదు చేసే వీలుంటుందని చట్టం స్పష్టం చేస్తోంది.

తనిఖీలు నిర్వహిస్తున్నాం



మైనర్లు ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే మొదటి సారి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. మార్పు రాకుంటే మైనర్‌తో పాటు వాహన యజమానిపై సైతం కేసు నమోదు చేస్తున్నాం. ఇలాంటి వారిని గుర్తించేందుకు నిరంతరం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం.

– నరేశ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

వృద్ధురాలి హత్య

ఆసిఫాబాద్‌రూరల్: బండరాయితో కొట్టి వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన మండలంలోని వాడిగొందిలో చోటు చేసుకుంది. సీఐ రాణాప్రతాప్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆత్రం పొత్తుబాయి (60) శుక్రవారం మండలంలోని బనార్‌గొందిలో జరిగిన బంధువుల వివాహ వేడుకలకు వెళ్లింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కుమారుడి వరుసైన ఆత్రం మారుతి ద్విచక్ర వాహనం ఎక్కింది. మధ్యం మత్తులో ఉన్న మారుతి గ్రామ సమీపంలోకి రాగానే వాహనం ఆపి తాగి వృద్ధురాలు ధరించిన చేతి కడియాలు, ఇతర ఆభరణాలు లాక్కునేందుకు యత్నించాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్తానని బెదిరించడంతో అక్కడే ఉన్న బండరాయితో తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త మహదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మందమర్రిలో కలకలం రేపిన యువకుడి హత్య



యువకుడి మృతదేహం

పాతమంచిర్యాల: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున జరిగిన యువకుడి హత్య సంఘటన పట్టణంలో కలకలం రేపింది. ఎస్సై చంద్రకుమార్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కాసిపేట మండలంలోని మామిడిగూడెంకు చెందిన లౌవుడం సాగర్ (21)మందమర్రికి చెందిన గిరిబాబు లారీపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీ దిగిన సాగర్ సాయంత్రం ఇంటికి వెళ్లాడు. రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఫోన్ రావడంతో ఓనర్ డబ్బులు ఇస్తానన్నాడని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం పోలీసులు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ద్వారా తమ కుమారుడు మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లారీ ఓనర్ గిరిబాబు, వాటర్ ప్లాంట్ చిట్టి, బొడ్డు బాలాజీ, నూనె వెంకటేశ్, అల్లంకుంట గణేశ్, సాగర్ తమ కుమారుడిని హత్య చేశారని మృతుని తండ్రి తారాచంద్ ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్‌రెడ్డి కేసు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మొదటి జోన్ సీఎస్ఐ చర్చిలైన్‌లో సాగర్ గతంలో వాటర్ ప్లాంటులో పనిచేసినప్పటి నుంచి ఒక యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగుతోందని, శుక్రవారం రాత్రికూడా ఆమె కోసమే రావడంతో కుటుంబ సభ్యులు దాడి చేయించి ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రిలో చేర్పించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శుభకార్యానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- లారీ ఢీకొని వ్యక్తి మృతి
- జన్నారం మండలం రోటిగూడలో విషాదం



మహేశ్ (ఫైల్)

లక్సెట్టిపేట/జన్నారం: శుభకార్యానికి వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన రాగం శంకరయ్య, లక్ష్మి దంపతులకు కుమారుడు మహేశ్(35), ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మంచిర్యాలలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న మహేశ్‌కు భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలున్నారు. ఉద్యోగరీత్యా మంచిర్యాలలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం జన్నారం మండలంలో జరిగిన బంధువుల వివాహానికి, దండేపల్లి మండలంలో జరిగిన మరో శుభకార్యానికి హాజరయ్యాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు తిరిగి వెళ్తుండగా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఆంధ్రాకాలనీ వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం రోటిగూడలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎసై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

బీసీ గణనకోసం ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: బీసీ గణనకోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గాండ్ల తిలకేశ్వర సంఘ కార్యాలయంలో శనివారం బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో బీసీల లెక్క తేలితేనే రిజర్వేషన్లు, సంక్షేమ ఫలాలు దక్కుతాయన్నారు. బ్రిటీష్‌ల పాలనలో 1931లో చివరిసారిగా బీసీల జనాభా లెక్కలు తీశారని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా బీసీల గురించి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వమే జనగణన చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, భారత్ బచావో రాష్ట్ర కమిటీ నాయకులు వడ్డేపల్లి మనోహర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, తులా మధుసూదన్, సూరినేని కిషన్, పాయిరాల రాములు, సతీష్ యాదవ్, గజెల్లి వెంకటయ్య, సమ్ము రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

పాతమంచిర్యాల: పేద విద్యార్థులకు తెలంగాణ బీసీ జాగృతి ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీరాముల హారిక, బోయిన అక్షయ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బీసీ జాగృతి నాయకులు డాక్టర్ రాజారమేశ్, ఇత్యాల కిషన్, పట్టణ అధ్యక్షుడు వైద్యభాస్కర్, కార్యదర్శి రవి, యువ జాగృతి నాయకులు మంచర్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి




మాట్లాడుతున్న ఏజెంట్ రాముడు

పాతమంచిర్యాల: కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు అన్నారు. ఏజెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో పనిచేస్తేనే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఉద్యోగులు తమ విధులతో పాటు ఆరోగ్యంపై కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిత్యం యోగా, వ్యాయామం చేయడం వల్ల దీర్ఘకాలిక జబ్బుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, పిట్ కార్యదర్శి జంపయ్య, సంక్షేమాధికారి పాల్‌స్రుజన్, ఇంజనీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, వెంటిలేషన్ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మప్రేమకు దూరమైన చిన్నారులు

- వడదెబ్బతో మహిళ మృతి
- మదర్స్‌డేకు ముందురోజే ఘటన



అనపర్తి సుమ(ఫైల్)



నిరాశగా చూస్తున్న చిన్నారులు

భీమారం(చెన్నూర్): మదర్స్ డేకు ముందు రోజే ఆ చిన్నారులు అమ్మప్రేమకు దూరమయ్యారు. ఆదివారం అంతా మాతృదినోత్సవం జరుపుకుంటుండగా ఆ ఇంట్లో మాత్రం విషాదఛాయలు అలుముకున్నాయి. వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లగూడెంకు చెందిన అనపర్తి సుమ (29) శుక్రవారం ఉదయం అదే గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగివచ్చింది. వాంతులు చేసుకోవడంతో పాటు జ్వరం కూడా రావడంతో అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త ప్రేమ్‌కుమార్, కుమార్తెలు మీనాక్షి, మనశ్రీ, కుమారుడు రిహాన్ ఉన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం

తిర్యాణి(ఆసిఫాబాద్): తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని రొంపెల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల గ్రామానికి చెందిన పెందూర్ మహిపతిరావు, విజయ దంపతుల కుమారుడు యోనస్(12)స్థానిక పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. శనివారం తలకు పెట్టుకునేందుకు షాంపు తీసుకురావాలని విజయ కుమారుడు యోనస్‌ను కోరడంతో అందుకు నిరాకరించాడు. దీంతో అతని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంటి పరిసరాల్లో ఇటుకల్లో దాచి ఉంచిన పురుగుల మందు తాగాడు. గమనించిన విజయ స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యుడు హర్షవర్ధన్ తెలిపారు.


చదువుకుందాం రండి..!


పుస్తకం హస్తభూషణం..ఒక పుస్తకం వెయ్యి మంది మిత్రులతో సమానం.. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు పెద్దలు. ప్రస్తుతం వేసవి సెలవులు ఓ వైపు.. ముదురుతున్న ఎండలు మరోవైపు.. ఈ నేపథ్యంలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదవడం మేలు. సాహిత్యం, విజ్ఞానం, మేధస్సుకు సంబంధించిన వివిధ పుస్తకాలు చదువుకోవడం మంచిది. సెల్‌ఫోన్‌కు అలవాటు పడుతున్న విద్యార్థులను పుస్తక పఠనం వైపు తీసుకువెళ్లేందుకు సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి.

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుందాం
- ఇంటిపట్టున ఉండి విజ్ఞానం పెంచుకుందాం
- మార్కెట్లో విరివిగా పుస్తకాలు
- పుస్తక పఠనంతో విజ్ఞానం



కథల పుస్తకాలు చదువుతున్న చిన్నారులు





కెరమెరి(ఆసిఫాబాద్): పిల్లలకు సెలవులు వస్తున్నాయంటే పెద్దల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ఏడాది పాటు చదువు కోసం కార్పొరేట్ కాలేజీలకు వెళ్లిన పిల్లలు ఎప్పుడూ బిజీయే... వీరందరికీ వేసవి సెలవులు ఆటవిడుపు.. ఇంటికి వచ్చిన పిల్లలతో కుటుంబం సంతోషంగా గడపడం ఒక ఎత్తయితే స్నేహితులతో కలిసి ఎండలో తిరిగే పిల్లలతో పెద్దలకు టెన్షన్. ఇంటర్, పదో తరగతి ఫలితాలు రావడంతో విద్యార్థుల్లో ఉన్న టెన్షన్ కూడా పోయింది. ఇక ఉన్న సమయమంతా వృథా కాకుండా ఉండేందుకు పుస్తక పఠనం ఎంతో మేలు చేయనుంది.

సమాజాన్ని మేల్కొలిపేవి పుస్తకాలే..

ప్రస్తుత వేసవి సెలవుల నేపథ్యంలో విజ్ఞానాన్ని అందించే సాధనం పుస్తకం. గుడి, బడి ఉద్యానవనం, నిధి, కొడుకు, చెరువు వంటి సప్త సంతానాల్లో కావ్యం ఒక్కటే శాశ్వతంగా నిలబడుతుంది. ప్రజాస్వామ్యానికి ఉన్న స్తంభాలను నిలబెట్టేది పుస్తకమే. సంస్కార వంతులు పుస్తకం వ్యామోహంగా భావిస్తారు. సమాజాన్ని నిద్రలేపి మేల్కొలిపే పుస్తకాలు ఉన్నాయి.

విద్యార్థులు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర చదవాలి

విద్యార్థులు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలి. పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టి ఉన్నతికి ఉపయోగపడే విద్యను అందిస్తే మానసిక ఉల్లాసానికి కథల పుస్తకాలు, గొప్పవారి జీవిత చరిత్రలు ఉపయోగపడతాయి. బాల భారతం, రామాయణం వంటి పుస్తకాలతో పాటు ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించడం, వివిధ భాషల్లో అనర్గళంగా మాట్లాడడం, అక్షర దోష నివారణ, వ్యాసాలు రాయడం వంటి వాటిపై పట్టు సాధించాలి.

బొమ్మల కథలతో ఆసక్తి..

చిన్నప్పటి నుంచి స్కూల్ పుస్తకాలు చదవమంటేనే బోరుమంటూ తలలు పట్టుకునే పిల్లలు సైతం బొమ్మలతో ముద్రితమయ్యే చందమామ, బాల మిత్ర కథల పుస్తకాలు కనబడితే చాలు టక్కున పేజీలు తిప్పేస్తుంటారు. అందులో మొదలు ఆకట్టుకునే రంగురంగుల బొమ్మలు, అవే పిల్లలను పఠనం వైపునకు నడిపిస్తాయి. అలా ఆరంభమైన కథలు చదివే అలవాటుగా క్రమంగా ఆలోచన సరళిని పెంచుతాయి.

సెల్‌ఫోన్ నుంచి మళ్లించాలి

ప్రస్తుత తరుణంలో చిన్నవారి దగ్గర్నుంచి పెద్దల వరకు మొబైల్ వాడకం అధికంగా పెరిగింది. దీంతో విద్యార్థుల్లో పఠనాశక్తి పూర్తిగా తగ్గుతూ వస్తుందని ఇటీవల ఓ సర్వే వెల్లడించింది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఆ తర్వాత ఇళ్లకు చేరగానే సెల్‌ఫోన్ మోజులో పడుతున్నారు. ఫలితంగా విద్యార్థులకు పుస్తకం చదవడం రావడం లేదు. సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలచేత ఆకట్టుకునే పుస్తకాలను చదివించడం అలవాటు చేస్తే బడికి వెళ్లిన తర్వాత కూడా అదే అలవాటుగా ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇదిగిదిగో పుస్తకాలు..

మార్కెట్లో ఏ పుస్తక దుకాణానికి వెళ్లినా లేదా రైల్వే స్టేషన్‌కు వెళ్లినా.. అంగట్లోని బుక్ స్టాల్లో కాస్త దృష్టి సారించినా పలు బొమ్మల కథలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే అనేక పుస్తకాలు కనిపిస్తాయి. ఇప్పటికీ ఆయా స్టాళ్లలో పెద్ద బాలశిక్ష, యకాన్‌విన్ యాత్రస్మృతి, వేయి పడగలు, మైదానం, చదువు, పాకుడు రాళ్లు, విశ్వంభర పుస్తకాలు చెక్కు చెదరని డిమాండ్‌తో అమ్ముడు పోతున్నాయి. అంతే కాకుండా ప్రముఖ నవలా రచయిత్రి యుద్దనపూడి సులోచన రాణి, మీనా–1తో పాటు మీరూ విజయాన్ని సాధించగలరు, నా జీవన గమనం, అక్బర్ బీర్బల్, ఇండియా విన్ డ్రీమ్స్, సాల్మాన్‌రష్డి, గోదాన్, పంచతంత్ర పుస్తకాలు ఇప్పటికీ పాఠకులను ఆకట్టుకుంటున్నాయి.